కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -271 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 11-10-2026 ఆదివారం పేజీలు : 4

# రిజర్వేషన్లలో బీసీల జోరు!



- బీసీలకు భారీ కోటా.. కేబినెట్ ఓకే!
- సర్పంచ్ నుంచి మేయర్ వరకు బీసీలకే పెద్దపీట
- 3,128 సర్పంచ్ స్థానాలు బీసీలకు!
- ఎంపీటీసీ, ఎంపీపీల్లోనూ రిజర్వేషన్లు
- జడ్పీటీసీల్లో 152.. చైర్మన్లలో 7
- మున్సిపాలిటీల్లో 1,273 వార్డులు బీసీలకు
- 17 మేయర్ పదవుల్లో 6 బీసీలకే!
- డెడికేటెడ్ కమిషన్ నివేదికకు ఆమోదం
- తుది జాబితాపైనే అందరి చూపు!

**న్యూస్ డెస్క్, 10 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల అంశం కీలక మలుపు తిరిగింది. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వరకు వెనుకబడిన తరగతులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదికకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. కమిషన్ సిఫారసుల ఆధారంగా వివిధ స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించాల్సిన స్థానాలపై నిర్ణయం తీసుకోవడంతో రాబోయే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

స్థానిక సంస్థల్లో బీసీలకు సుమారు 28 శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు, మిగిలిన ఆరు శాతం వరకు కూటమి పార్టీలు తమ పార్టీ పరంగా కేటాయించాలని నిర్ణయించినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్థానిక ప్రజాప్రతినిధుల పదవుల్లో బీసీలకు మరింత ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది. అయితే తుది రిజర్వేషన్లు, స్థానాల కేటాయింపుపై అధికారిక ఉత్తర్వులు వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

గ్రామ పంచాయతీల్లో 3,128 సర్పంచ్ స్థానాలు

గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించే స్థానాల వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13,351 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 3,128 సర్పంచ్ పదవులను బీసీలకు రిజర్వు చేయనున్నారు.

మిగతాది 2 లో..

# ఎల్‌నినో ఎఫెక్ట్‌పై రేవంత్ స్పెషల్ ఫోకస్!




**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలో కురిసిన తక్కువ వర్షపాతం, దాని వల్ల ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులపై చర్చించేందుకు ఈ నెల 12న సచివాలయంలో మంత్రులతో ఉన్నత స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గి కరవు ఛాయలు అలముకున్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు , ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ ఉపశమన చర్యలపై ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించనున్నారు.

# పూల మార్కెట్లలో పండుగ మంటలు!

- బతుకమ్మకు ముస్తాబైన పూల మార్కెట్లు
- రెట్టింపైన ధరలతో సామాన్యులకు షాక్
- తంగేడు, గునుగు పూలకు భారీ డిమాండ్
- తొమ్మిది రోజుల పాటు పూల పండుగ
- ఈ నెల 18న సద్దుల బతుకమ్మ
- ధరలు పెరిగినా తగ్గని పండుగ జోష్




**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** తెలంగాణ రాష్ట్ర పండుగ, ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ప్రకృతిని, పూలను పూజించే ఈ తొమ్మిది రోజుల మహోత్సవం శనివారం అమావాస్య రోజున 'ఎంగిలి పూల బతుకమ్మ'తో అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని పూల మార్కెట్లు తంగేడు, గునుగు, చామంతి, బంతి, గులాబీ వంటి రంగురంగుల పువ్వులతో కళకళలాడుతున్నాయి. అయితే, పండుగ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేయడంతో పూల మార్కెట్లలో ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు పూల కొనుగోలు తీవ్ర ఆర్థిక భారంగా మారింది.

# జానీ జానీ ఎస్ పప్పా.. జ్ఞానేశ్ నో పప్పా!




**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** "జానీ జానీ ఎస్ పప్పా.. జ్ఞానేశ్ కుమార్ నో పప్పా!".. ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ ఫన్నీ రైమ్ ట్రెండింగ్‌గా మారింది. సాధారణంగా చిన్న పిల్లలకు పాలు తాపడానికో, లేదంటే రైమ్స్ నేర్పడానికో వాడే ఈ కవితను ఏకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయ నిరసనకు అస్త్రంగా మలచడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

# భారీ భూకంపం.. పనామా వణుకు!



- పనామాలో 7.7 తీవ్రతతో భూకంపం
- ప్రకంపనలతో వణికిన రాజధాని పనామా సిటీ
- ప్రాణభయంతో ఇళ్ల నుంచి పరుగులు
- పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న భవనాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నిలిచిపోయిన విమాన సర్వీసులు
- వరుస ఆఫ్టర్‌షాక్స్‌తో ప్రజల్లో భయం

2 లో

# షర్జీల్ బెయిల్‌పై మళ్లీ కోర్టులో పంచాయితీ!




- షర్జీల్ ఇమామ్‌కు బెయిల్ రద్దు కోరిన పోలీసులు
- బెయిల్ షరతుల ఉల్లంఘనపై అభ్యంతరం
- మీడియాతో మాట్లాడినట్లు పోలీసుల ఆరోపణ
- సోషల్ మీడియాపైనా ఆంక్షలు బేఖాతరు?
- కోర్టు ఆదేశాలను కాలరాశారంటూ పిటిషన్
- మధ్యంతర ఉపశమనం తక్షణమే రద్దు చేయాలని విజ్ఞప్తి
- 2020 ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో నిందితుడు
- పోలీసుల పిటిషన్‌పై కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ

# భూములపై సర్కార్ సమరం!

- 2,240 గ్రామాల్లో భూముల రీ సర్వే
- ఏడాదిన్నరలో సర్వే పూర్తి చేయడమే లక్ష్యం
- భూ వివాద రహిత తెలంగాణకు కార్యాచరణ
- పర్యవేక్షణకు ఏడు జోన్లు.. 14 మంది అధికారులు
- హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డు ఏర్పాటు
- సర్వే పేరుతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు
- ఎర్రవల్లిలో 45 ఎకరాల మేర వ్యత్యాసం




**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర రీ సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని భూ వివాద రహిత తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రీ సర్వే కోసం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. సచివాలయంలో భూముల రీ సర్వే ఏర్పాట్లు, పర్యవేక్షణ, పురోగతిపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సర్వేను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు.

రాష్ట్రాన్ని ఏడు జోన్లుగా విభజించి, ఒక్కో జోన్‌కు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరి చొప్పున మొత్తం 14 మంది అధికారులను పర్యవేక్షణ బాధ్యతల్లో నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ సర్వేను రాష్ట్రస్థాయిలో పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

# ఇందిరమ్మ బీమాకు ముహూర్తం ఫిక్స్!

- రైతు కుటుంబాలకు రూ.5 లక్షల భరోసా
- నవంబర్ 19న ఇందిరమ్మ బీమా ప్రారంభం
- ఇందిరాగాంధీ జయంతి రోజున అమలు
- ప్రతి పేద కుటుంబానికీ బీమా రక్షణ
- కులం, మతం, ఆదాయంతో సంబంధం లేదు
- రైతుబీమా నిలిచిపోవడంతో ఆందోళన
- పరిహారం కోసం రైతు కుటుంబాల ఎదురుచూపులు
- ఇందిరమ్మ బీమాపై భట్టి కీలక ప్రకటన

2 లో

# గెలిస్తే ఘనత.. ఓడితే ఈవీఎంలా?

- విపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు ఫైర్
- ఈసీ, ప్రధాని రాజీనామా డిమాండ్లపై విమర్శ
- ఓట్ల తొలగింపుపై ఆరోపణలు సరికాదన్న వెంకయ్య
- ఆధారాలతోనే ఎన్నికల అభ్యంతరాలు చెప్పాలి
- నిరసనలు శాంతియుతంగా జరగాలన్న హితవు
- ఏపీ ఎమ్మెల్యేల అధికార దుర్వినియోగంపై వ్యాఖ్యలు
- ప్రజలకు ఉపయోగపడే బిల్లులపై ఫోకస్ చేయాలి




**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** విపక్షాలపై మరోసారి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయాలతో ముడిపెట్టడం, వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు... కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ , ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు..

ఓట్ల తొలగింపుపై ఆరోపణలు సరికాదు

ఓట్లను మూకుమ్మడిగా తొలగించారనే ప్రచారం కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు.

# రష్యాతో అమెరికా భారీ ఆయిల్ డీల్!

- రష్యా చమురుపై ట్రంప్ యూటర్న్
- డీజిల్ దిగుమతులకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్
- ఇంధన మార్కెట్‌లో కొత్త సమీకరణాలు
- ఆంక్షల హెచ్చరికల నుంచి ఒప్పందం వరకు
- రష్యాపై వైఖరి మార్చుకున్న ట్రంప్
- ఉక్రెయిన్ యుద్ధ వేళ కీలక పరిణామం
- అంతర్జాతీయ దౌత్యంలో పెరిగిన ఉత్కంఠ

2 లో

# విమానంలోనే అభిజీత్ దీప్కే అరెస్ట్!

- ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పోలీసుల హైడ్రామా
- అభిజీత్ దీప్కేతో పాటు ఇద్దరు నేతలు అదుపులోకి
- జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత
- 500 మందికిపైగా నిరసనకారుల అరెస్ట్
- సీఈసీ రాజీనామాకు సీజేపీ డిమాండ్
- ప్రాణం తీసినా ఉద్యమం ఆగదన్న దీప్కే
- ఢిల్లీలో భారీగా భద్రతా బలగాల మోహరింపు

2 లో

# ఇందిరమ్మ బీమాకు ముహూర్తం ఫిక్స్!



**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** తెలంగాణ రైతు కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచిన రైతు బీమా నిలిచిపోవడంతో అన్నదాతలు ఆందోళనలోఉన్న నేపథ్యంలో ఇందిరమ్మ బీమా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బిగ్ అప్ డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి నవంబరు 19న రూ.5 లక్షల బీమా పథకం 'ఇందిరమ్మ బీమా'ను ప్రారంభించనున్నట్లు తాజాగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. శనివారం ఖమ్మం-నల్గొండ- వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత కార్యకర్మం ఖమ్మంలో జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన భట్టి.. ఈ పథకం అమలలో కులం మతం, ఆదాయం ఏమీ చూడమని కేవలం తెలంగాణలో పుట్టడమే వారికి ఉన్న అర్హత అన్నారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్న్?నామన్నారు.

రైతుల కుటుంబాల్లో ఆందోళన: కాగా రైతు మరణిస్తే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబీమా పథకం తీసుకువచ్చింది. అయితే ప్రస్తుతం ఈ పాలసీకి సంబంధించి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు వందలాది మంది రైతులు మరణించినా వారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భరోసా దక్కక అయోమయంలో పడ్డాయి. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ బీమా పథకం అమలు చేస్తామని ఇప్పటికే బడ్జెట్ లో ప్రకటించిన ప్రభుత్వం తాజాగా అమలు తేదీపై మరోసారిక్లారిటీ ఇచ్చింది. రాబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# విమానంలోనే అభిజీత్ దీప్కే అరెస్ట్!



**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలో ఆందోళనకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కేను పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళనలో పాల్గొనేందు శనివారం ముంబయి నుంచి ఢిల్లీ చేరుకున్న సీజేపీ ప్రధాన నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్ అశితోశ్ రంకాను పోలీసులు అరెస్టు చేశారు. వీరు ప్రయాణిస్తున్న విమానం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ల్యాండ్ కాగానే పోలీసులు నేరుగా విమానంలోకి ప్రవేశించి ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వైపు జంతర్ మంతర్ వద్దకు వచ్చిన సీజేపీ కార్యకర్తలను పెద్ద ఎత్తున పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 500 మందికిపై గా నిరసనకారులను అదులులోకి తీసుకున్నారు. మరోవైపు నిరసనకారులెవరూ జంతర్ మంతర్ వద్దకు రాకుండా పోలీసులు నిలువరిస్తున్నారు. దీంతో నిరసనకాలు, పోలీసులతో ఢిల్లీ లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

**ప్రాణం తీసినా ఉద్యం ఆగదు:**

ఆందోళనకారులపై పోలీసులు చర్యల నేపథ్యంలో సీజేపీ ఫౌండర్ దీప్కే హాట్ కామెంట్స్ చేశారు. నా ప్రాణం తీసినా.. ఉద్యమం ఆగదన్నారు. బెదిరింపులకు భయపడేది లేదని ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం యువత నిరసనలకు భయపడుతోందా? అని నిలదీశారు. నిరసనల నేపథ్యంలో రైళ్లు, మెట్రో సేవల నిలిపివేతపై ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. ఢిల్లీలో భారీగా భద్రతా బలగాల మోహరింపుపై విమర్శలు గుప్పించారు. నిరసనల్లో పాల్గొనకుండా ప్రజలను అడ్డుకుంటున్నారంటూ ఆరోపించిన దీప్కే శాంతియుత నిరసన రాజ్యాంగం కల్పించిన హక్కు అని అరెస్టులకు భయపడను.. పోరాటం కొనసాగిస్తానన్నారు.

# జానీ జానీ ఎస్ పప్పా.. జ్ఞానేశ్ నో పప్పా!

మొదటి పేజీ తరువాయి

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీరుపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు పార్లమెంట్ నుంచి రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఢిల్లీ పర్యటనలో ఉన్న మమతా బెనర్జీ తనదైన శైలిలో కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై విరుచుకుపడ్డారు. కాగా, ఆమె చిన్నపిల్లల రైమ్‌ను మార్చి పాడుతున్న ఈ సరదా వీడియోను ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) ఎంపీ సుప్రియా సూలే తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

ఈ వీడియోలో మమతా బెనర్జీ చాలా ప్రశాంతంగా, చిరునవ్వుతో అందరినీ ఆకట్టుకుంటూ ఈ రైమ్‌ను పలికారు. జానీ జానీ ఎస్ పప్పా.. ఎస్ఐఆర్ నో పప్పా.. రాజీనామా చేయి ఎస్ పప్పా.. అరెస్ట్ చేయి ఎస్ పప్పా.. ప్రజాస్వామ్యాన్ని రక్షించు ఎస్ పప్పా.. భారత్‌ను కాపాడు ఎస్ పప్పా.. జ్ఞానేశ్ కుమార్ నో పప్పా.. బీజేపీ ప్రభుత్వం నో పప్పా..' అంటూ ఆమె కవిత రూపంలో తన నిరసనను గట్టిగా వినిపించారు. ఆమె పక్కనే ఉన్న టీఎంసీ నేత మహువా మొయిత్రా కూడా ఈ సరదా వ్యంగ్యాస్త్రానికి చిరునవ్వులు చిందించడం విశేషం. ఈ నిరసనల నేపథ్యంలో, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే కఠినమైన ఆంక్షలు పెట్టామని ప్రభుత్వ వర్గాలు చెబుతుంటే.. దీది దానిని కూడా తనదైన శైలేలో తిప్పికొట్టారు. "ప్రజలకు ఇబ్బంది రాకూడదనే ఇన్ని ఆంక్షలని మాకు నేర్పొద్దు.. రేపు శనివారం, ఈ రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు బంద్ కదా!" అంటూ ఆమె ఎద్దేవా చేశారు.

మొత్తానికి, ఎన్నికల సంఘం నిర్ణయాలకు వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనకు తన పూర్తి మద్దతు ప్రకటించారు మమతా బెనర్జీ. అయితే ఢిల్లీకి వెళ్లి నేరుగా ఆందోళనలో పాల్గొనే బదులు, కోల్‌కతాలోని గాంధీ విగ్రహం వద్దే ధర్నా చేపట్టాలని నిర్ణయించుకున్నారు. గతంలోనూ బెంగాల్ ఎన్నికల సమయంలో మమతా బెనర్జీ చేసిన వివిధ రకాల హావభావాలు, మీమ్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఈ జానీ జానీ' రైమ్ పాలిటిక్స్ నెట్టింట మరోసారి పెద్ద చర్చకు దారితీశాయి.

# షర్జీల్ బెయిల్‌పై మళ్లీ కోర్టులో పంచాయితీ!



**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** 2020 నాటి ఈశాన్య ఢిల్లీ అల్లర్ల వెనుక ఉన్న భారీ కుట్ర కేసులో నిందితుడిగా ఉన్న జేఎన్‌యూ మాజీ విద్యార్థి షర్జీల్ ఇమామ్ కు మంజూరైన తాత్కాలిక బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ పోలీసులు స్థానిక కోర్టును ఆశ్రయించారు. తన కజిన్స్ వివాహ వేడుకలకు హాజరయ్యేందుకు కర్కర్‌డూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి ఆయనకు అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు వారం రోజుల పాటు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. అయితే, బెయిల్‌పై బయటకు వచ్చిన సమయంలో సోషల్ మీడియా ఉపయోగించరాదని, ఎలాంటి మీడియా ప్రతినిధులతో సంభాషించకూడదన్న స్పష్టమైన న్యాయస్థాన ఆదేశాలను షర్జీల్ ఇమామ్ బేఖాతరు చేశారని పోలీసులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. మధ్యంతర బెయిల్ సమయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

కోర్టు కల్పించిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోకుండా నిందితుడు ఉద్దేశపూర్వకంగా బెయిల్ నిబంధనలను ఉల్లంఘించారని, ఇది న్యాయస్థానం విధించిన షరతులను కాలరాయడమేనని పోలీసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన వెసులుబాటును దుర్వినియోగం చేసినందుకుగాను ఆయనకు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని తక్షణమే రద్దు చేయాలని పోలీసు విభాగం కోరింది. సీఏఏ వ్యతిరేక ఆందోళనల సమయంలో దేశద్రోహం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉప) కింద అరెస్టయి సుదీర్ఘకాలంగా జైల్లో ఉంటున్న షర్జీల్ ఇమామ్ బెయిల్ రద్దు పిటిషన్‌పై ఢిల్లీ న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే అంశం ప్రస్తుతం న్యాయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# రష్యాతో అమెరికా భారీ ఆయిల్ డీల్!



**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** రష్యా చమురు దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యమైన యూటర్న్ తీసుకున్నారు. రష్యాతో అమెరికా ఒక భారీ చమురు ఒప్పందాన్ని కుదుర్చుకుందని, రష్యా నుంచి డీజిల్ కొనుగోలు చేయడానికి తాను గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఆయన స్వయంగా వెల్లడించారు. ఈ సరికొత్త ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఫలితంగా అమెరికాకు పెద్ద మొత్తంలో ముడి చమురు నిల్వలు వచ్చి చేరుతున్నాయని, అలాగే దేశీయ అవసరాలకు తగిన స్థాయిలో రష్యా నుంచి నాణ్యమైన డీజిల్ కూడా దిగుమతి అవుతోందని ట్రంప్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ధరల స్థిరీకరణతో పాటు దేశీయంగా పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తట్టుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అమెరికా వర్గాలు పేర్కొంటున్నాయి.

అయితే, ఇప్పటివరకు రష్యా నుంచి ముడి చమురు, సహజవాయువును కొనుగోలు చేసే మిత్రదేశాలు, ఇతర దేశాలపై భారీగా ఆర్థిక ఆంక్షలు, సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తామని పదేపదే హెచ్చరించిన ట్రంప్.. ఇప్పుడు తానే స్వయంగా రష్యాతో ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పాశ్చాత్య దేశాలు రష్యా ఆర్థిక మూలాలపై ఒత్తిడి తెస్తున్న వేళ, అమెరికాయే నేరుగా రష్యన్ డీజిల్ దిగుమతులకు మార్గం సుగమం చేయడం ప్రపంచ దేశాలను విస్మయానికి గురి చేస్తోంది. గతంలో చేసిన తీవ్ర హెచ్చరికలకు పూర్తి విరుద్ధంగా ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ దౌత్య సంబంధాలు, చమురు రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీసింది.

# గెలిస్తే ఘనత.. ఓడితే ఈవీఎంలా?

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో గెలిచినప్పుడు ఆ విజయాన్ని తమ ఘనతగా చెప్పుకోవడం, ఓడిపోయినప్పుడు మాత్రం ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో వాటిని తెలియజేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. అయితే, ఆ నిరసనలు హింసాత్మకంగా మారకూడదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో లోటుపాట్లు ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఏపీలో ఎమ్మెల్యేల తీరుపైనా వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్‌లో కొందరు ఎమ్మెల్యేలు తామే సర్వాధికారులమన్నట్లుగా వ్యవహరిస్తున్నారని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. అధికారుల బదిలీల విషయంలో తమ అధికారాన్ని ఉపయోగిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు తమ పాత్రను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇక, ఎమ్మెల్యేల ప్రధాన బాధ్యతల్లో అసెంబ్లీలో ప్రజలకు ఉపయోగపడే బిల్లుల ఆమోదానికి చొరవ చూపడం కూడా ముఖ్యమని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు తమ అధికారాలను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలని ఆయన అభిప్రాయపడ్డారు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు.

# ఎల్‌నినో ఎఫెక్ట్‌పై రేవంత్ స్పెషల్ ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

**అతి ముఖ్యమైన ఐదు అంశాలపై దృష్టి**

ఈ ప్రత్యేక సమావేశంలో ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి సారించనున్నారు. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్ , కరవు ప్రాంతాల తక్షణ అవసరాలపై ప్రభుత్వం ప్రధానంగా చర్చించనుంది. ఇప్పటికే జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించిన నేపథ్యంలో, ఈ సమీక్షా సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం , దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంపై యంత్రాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

**కేంద్రాన్ని రూ. 20 వేల కోట్ల ప్యాకేజీ కోరిన ప్రభుత్వం**

రాష్ట్రంలో కరువు మండలాలను అధికారికంగా ప్రకటించడంతో పాటు బాధిత రైతులకు, ప్రాంతాలకు తగినంత ఆర్థిక సాయం అందించేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేయడమే కాకుండా, కరవు నివారణ చర్యల కోసం రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని కోరింది. ఈ నెల 12న జరగబోయే సమావేశంలో వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన తక్షణ సహాయక చర్యలతో పాటు మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు, రైతు సంఘాలు , వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలను స్వీకరించడంపై నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

# పూల మార్కెట్లలో పండుగ మంటలు!

మొదటి పేజీ తరువాయి

**తొమ్మిది రోజుల బతుకమ్మ విశేషాలు.. ఈ నెల 18న సద్దుల బతుకమ్మ**

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ఈ తొమ్మిది రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో పేరుతో బతుకమ్మను పేర్చి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. మొదటి రోజు శనివారం 'ఎంగిలిపూల బతుకమ్మ'తో మొదలై, రెండో రోజు 'అటుకుల బతుకమ్మ', మూడో రోజు 'ముద్దపప్పు బతుకమ్మ', నాల్గో రోజు 'నానే బియ్యం బతుకమ్మ', ఐదో రోజు 'అట్ల బతుకమ్మ', ఆరో రోజు 'అలిగిన బతుకమ్మ', ఏడో రోజు 'వేపకాయల బతుకమ్మ', ఎనిమిదో రోజు 'వెన్నముద్దల బతుకమ్మ'గా వేడుకలు నిర్వహిస్తారు. ఇక తొమ్మిదో రోజు, ఈ నెల 18వ తేదీన మహా వేడుకగా జరుపుకునే 'సద్దుల బతుకమ్మ'తో ఈ పూల సంబరం ముగుస్తుంది.

ధరల భారం ఉన్నా తగ్గని పండుగ ఉత్సాహం

ప్రధాన మార్కెట్లలో బంతి, చామంతి, గునుగు పూల ధరలు గతేడాదితో పోలిస్తే రెట్టింపయ్యాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మొదటి రోజు కావడంతో మార్కెట్లలో పూల ధరలు మరింత ప్రియంగా మారే అవకాశముంది. అయినప్పటికీ, సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ కావడం, బతుకమ్మను తప్పనిసరిగా పూలతోనే పేర్చాల్సి ఉండటంతో ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ పరిమాణంలో పూలను కొనుగోలు చేస్తూ పండుగను జరుపుకోవడానికి ఆడపడుచులు సిద్ధమవుతున్నారు. పండుగ వాతావరణం ప్రతి ఇంటా ప్రతికూలతల నడుమ కూడా ఉత్సాహాన్ని నింపుతోంది.

# వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఈడీ బిగ్ స్టెప్



**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమ ఆస్తుల కేసులకు సంబంధించి ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసుల విచారణను రోజువారీగా నిర్వహించి వేగంగా పూర్తి చేయాలని ఈడీ తన పిటిషన్‌లో కోరింది. వైఎస్ జగన్‌తో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న అందరూ విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ కోరింది. సీబీఐ కోర్టులో తొమ్మిది ఛార్జిషీట్లు గత పదేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయని, డిశ్చార్జి పిటిషన్లు తేలకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ ఆందోళన వ్యక్తం చేసింది.

ఆర్థిక నేరాలపై తీవ్రత..

ఆర్థిక నేరాలను దేశ ఆర్థిక ఆరోగ్యానికే ముప్పుగా పరిగణించాలని ఈడీ హైకోర్టును కోరింది. ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు.. జగన్ కేసుల త్వరితగతిన విచారణకు సంబంధించి గతంలో హరిరామజోగయ్య తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను గుర్తించింది. ఈ కేసులన్నింటినీ కలిపి ఒకేసారి ఈనెల 13న విచారించనున్నట్లు కోర్టు స్పష్టం చేసింది.

# భూములపై సర్కార్ సమరం!

మొదటి పేజీ తరువాయి

గ్రామాల్లో రోజువారీగా చేపడుతున్న సర్వే వివరాలు రియల్‌టైంలో కనిపించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని చెప్పారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సంబంధిత గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించి పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తానే స్వయంగా సమీక్ష నిర్వహించి పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.

ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దుల గుర్తింపు ప్రక్రియకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని మంత్రి ఆదేశించారు. రీ సర్వే పేరుతో ప్రజల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, భూ యజమానులకు స్పష్టమైన సమాచారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో నక్షా పటాలు లేని 365 గ్రామాల్లో రీ సర్వే చేపట్టినట్లు పొంగులేటి వివరించారు.

రేవంత్ రెడ్డిపై సీబీఐకి లేఖ రాస్తున్నా.. కేఏ పాల్ కామెంట్స్

మరోవైపు జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 గ్రామాల్లో ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 245 చోట్ల సర్వే పూర్తయినట్లు పేర్కొన్నారు. భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలపై స్పష్టత తీసుకురావడం ద్వారా భవిష్యత్తులో వివాదాలు తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవల్లిలో 31 శాతం అసైన్డ్ భూములు చేతులు మారినట్లు గుర్తించామని మంత్రి మీడియా చిట్‌చాట్‌లో తెలిపారు. మొత్తం 385 ఎకరాల భూమికి సంబంధించి 45 ఎకరాల మేర వ్యత్యాసం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు మరికొందరికి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని వెల్లడించారు. మరోసారి సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఇక ఇందిరమ్మ టవర్స్ పథకంలో లబ్ధిదారుల ఎంపికకు నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఓటరు జాబితా, ఆధార్‌లోని స్థానికత వివరాలను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఖైరతాబాద్‌లో అర్హుల సంఖ్య తక్కువగా తేలడంతో మరోసారి డ్రా నిర్వహించి ఎంపిక చేస్తామని వివరించారు. సీపీఐ తమ మిత్రపక్షమని, ఆ పార్టీతో తమకు విభేదాలు లేవని కూడా పొంగులేటి స్పష్టం చేశారు.

# భారీ భూకంపం.. పనామా వణుకు!



**న్యూస్ డెస్క్,10 అక్టోబర్ (బిఎన్ఎస్):** మధ్య అమెరికా దేశమైన పనామాలో భారీ భూకంపం సంభవించింది. శుక్రవారం దక్షిణ పనామా ప్రాంతంలో 7.7 తీవ్రతతో భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భూకంపం ధాటికి రాజధాని పనామా సిటీలో భవనాలు కంపించాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ఈ ప్రకంపనలు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నమోదయ్యాయి.

అమెరికా భూగర్భ పరిశోధనా సంస్థ (యూఎస్‌జీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. పనామా దక్షిణ ప్రాంతంలోని పిటాలోసా అరిబాకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూమికి సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఈ ప్రకంపనలు సంభవించాయి. భూకంపం కారణంగా పలు ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పాటు విమాన సర్వీసులను సైతం నిలిపివేశారు.

భూకంపం అనంతరం వరుసగా డజనుకు పైగా ప్రకంపనలు (ఆఫ్టర్‌షాక్స్) సంభవించడంతో ప్రజల్లో భయం మరింత పెరిగింది. చాలా సేపటి వరకు భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. పలు ప్రావిన్సుల్లో అధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారు. భూకంపం ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని యూఎస్‌జీఎస్ హెచ్చరించినప్పటికీ.. నష్టం పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

భూకంపం ధాటికి ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైనే గడిపారు. సోషల్ మీడియాలో కనిపించిన వీడియోలలో వృద్ధులు భయంతో కన్నీళ్లు పెట్టుకోవడం కనిపించింది. ముఖ్యంగా హెరెరా ప్రావిన్స్‌లో భవనాలు దెబ్బతినడంతో అవి ఎక్కడ కూలిపోతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భూకంపం కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు, నష్టంపై అంచనాలు కొనసాగుతున్నాయి. వరుస ప్రకంపనల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# రిజర్వేషన్లలో బీసీల జోరు!

గ్రామ స్థాయిలో ప్రజలకు అత్యంత చేరువగా ఉండే సర్పంచ్ పదవుల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా స్థానిక పాలనలో వారి భాగస్వామ్యం పెరిగే అవకాశం ఉంది.

గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల స్థానాల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించనున్నారు. మొత్తం 1,33,910 వార్డు సభ్యుల స్థానాల్లో 30,315 స్థానాలను బీసీలకు కేటాయించనున్నట్లు వివరాలు సూచిస్తున్నాయి. దీంతో గ్రామ స్థాయి నుంచి స్థానిక రాజకీయాల్లో బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా రిజర్వేషన్ల కేటాయింపు చేపట్టినట్లు తెలుస్తోంది.

ఎంపీటీసీ, ఎంపీపీ పదవుల్లోనూ ప్రాతినిధ్యం

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలైన ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలకు గణనీయమైన సంఖ్యలో స్థానాలు కేటాయించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,913 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో 2,400 స్థానాలను బీసీలకు రిజర్వు చేయనున్నట్లు వివరాలు పేర్కొంటున్నాయి. మండల పరిషత్ అధ్యక్షులైన ఎంపీపీ పదవుల్లో మొత్తం 661 స్థానాలకు గాను 152 స్థానాలను బీసీలకు కేటాయించనున్నారు.

మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ, ఎంపీపీ పదవుల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా మండల స్థాయి నిర్ణయాల్లోనూ వారి భాగస్వామ్యానికి అవకాశం ఏర్పడనుంది.

జడ్పీటీసీల్లో 152 స్థానాలు.. ఛైర్మన్ పదవుల్లో ఏడు

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలైన జడ్పీటీసీ స్థానాల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కేటాయించనున్నారు. మొత్తం 661 జడ్పీటీసీ స్థానాల్లో 152 స్థానాలను బీసీలకు రిజర్వు చేయాలని నిర్ణయించినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవుల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 28 స్థానాల్లో ఏడు స్థానాలను బీసీలకు కేటాయించనున్నారు.

జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, గ్రామీణ ప్రాంతాలకు నిధుల కేటాయింపు, స్థానిక అవసరాలకు సంబంధించిన నిర్ణయాల్లో జిల్లా పరిషత్‌లకు కీలక పాత్ర ఉంటుంది. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ సభ్యుల నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ వరకు బీసీలకు ప్రాతినిధ్యం కల్పించేలా రిజర్వేషన్లను ఖరారు చేయడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

పట్టణ స్థానిక సంస్థల్లోనూ బీసీలకు అవకాశం

గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా పట్టణ స్థానిక సంస్థల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొత్తం 3,884 వార్డు స్థానాలు ఉండగా, వాటిలో 1,273 స్థానాలను బీసీలకు రిజర్వు చేయనున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవుల్లో మొత్తం 106 స్థానాలకు గాను 35 స్థానాలను బీసీలకు కేటాయించనున్నట్లు వివరాలు సూచిస్తున్నాయి.

కార్పొరేషన్ మేయర్ పదవుల్లోనూ రిజర్వేషన్లు

మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ పదవుల విషయంలోనూ బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17 మేయర్ పదవుల్లో ఆరు స్థానాలను బీసీలకు రిజర్వు చేయనున్నట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ఇది 35.29 శాతానికి సమానం. పట్టణ రాజకీయాల్లో కీలకమైన మేయర్ పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించడం ఈ నిర్ణయంలో మరో ముఖ్యమైన అంశంగా నిలుస్తోంది.

జిల్లాల్లో పర్యటించి నివేదిక రూపొందించిన కమిషన్

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు తదితర వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకొని నివేదిక రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ నివేదికను పరిశీలించిన రాష్ట్ర మంత్రివర్గం రిజర్వేషన్ల అంశంపై నిర్ణయం తీసుకుంది.

స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం, ఎన్నికల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశాలుగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వేషన్ల అమలు, స్థానాల వారీ తుది కేటాయింపు, ఎన్నికల షెడ్యూల్ వంటి అంశాలపై అధికారిక ప్రకటనలు కీలకం కానున్నాయి.

అధికారిక ఉత్తర్వులపై ఉత్కంఠ

కేబినెట్ ఆమోదం నేపథ్యంలో ఇప్పుడు అధికారిక ఉత్తర్వులు, తుది రిజర్వేషన్ల జాబితాపై ఆసక్తి నెలకొంది. ఏ గ్రామ పంచాయతీ, మండలం, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లో ఏ పదవి ఏ వర్గానికి రిజర్వు అవుతుందనే అంశం తుది జాబితా వెలువడిన తర్వాత స్పష్టమవుతుంది. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన తదుపరి పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# దుర్గమ్మ ఆలయ బోర్డు మెంబర్ బాధ్యతలు స్వీకరించిన కొణిదెల సుస్మిత



అమరావతి ,బిఎన్ఎస్ అక్టోబర్ 10. సృష్టి స్థితి లయకారిని గా ఇంద్రకీలాద్రిపై కలిసి ఉన్న దుర్గమ్మ దేవాలయ ట్రస్ట్ బోర్డ్ నెంబర్ గా కొణిదెల సుస్మిత నేడు బాధితులు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఈవో శీనా నాయక్ అమ్మవారి చిత్రపటాన్ని సుస్మితకు అందజేశారు. నాకు దుర్గమ్మకు ఎప్పటినుంచో అనుబంధం ఉందని సుస్మిత అన్నారు. అత్యంత వైభవంగా ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

# ఓట్ల చోరీ జ్ఞానేశ్ కుమార్ ను రాజీనామా చేయమంటే... అక్రమ అరెస్టులు చేస్తారా..?

## దేశంలో ఎమర్జెన్సీ తలపించే విధంగా నిర్బంధాన్ని విధించడాన్ని ఖండిస్తున్న కడప డివైఎఫ్ఐ

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 10: దేశంలో ఎమర్జెన్సీని తలపించే విధంగా కేంద్రం ఉద్యమ కారుల పై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని, ఓట్ల చోరీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ విద్యార్థుల, యువకులు అటు చలో ఢిల్లీ, ఇటు విజయవాడ చలో లోక్ భవన్ కు పిలుపునిచ్చిన సందర్భంగా నాయకులను ఎక్కడి, కక్కడ అరెస్టులు, గృహ నిర్బంధాలు నిర్బంచడం డివైఎఫ్ఐ గా తీవ్రంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం జమ్మలమడుగు స్థానిక ఎన్జీవో కార్యాలయం నందు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో ఒక ఓట్ల దొంగ ను కాపాడటానికి కేంద్రం ఇన్ని రకాల ప్రయత్నాలు చేస్తుండటం దారుణం అన్నారు. దేశ యువతతో పెట్టుకున్న ప్రభుత్వాలు మనుగడ సాధించే చరిత్ర ఎక్కడా లేదన్నారు. మోదీ ప్రభుత్వం దేశ యువతకు భయపడి ఢిల్లీ మొత్తాన్ని అష్టదిగ్బంధం చేసిందని కానీ యువత లక్షల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఓట్ల తొలగింపు పై కనీసం మాటైనా మాట్లాడకపోవడం దారుణం అన్నారు. ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని చలో లోక్ భవన్ కు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆఫీసులోకి వెళ్లి అరెస్టులు చేయడం మోడీకి వత్తాసు పలుకుతున్నారు అన్నారు. ఓట్ల తొలగింపు పై రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు స్పందించకపోతే బెంగాల్ తరహా మీకు గుణపాఠం తప్పవు అన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదని




ఇప్పటికైన కేంద్రం ఆయనను తప్పించాలని లేకుంటే దేశ యువతతో చెంపపెట్టు తప్పదన్నారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సుబహాన్ అరుణ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై.. జమ్మలమడుగు టిడిపి ప్రజాదర్బార్..!

## ప్రజా వినతుల స్వీకరణ.. పరిష్కార మార్గాలకు అధికారులకు ఆదేశం చేసిన జిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ రెడ్డి..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 10: సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని లేకపోతే ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారులపై ఉపేక్షించేది లేదని, టిడిపి కడప జిల్లా అధ్యక్షుడు, జమ్మలమడుగు తెలుగుదేశం ఇన్చార్జి భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం భూపేష్ సుబ్బరామిరెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపై కార్యాలయాలకు ప్రజలు వస్తే వాటిని వెంటనే పరిష్కరించి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. అలాగే కార్యకర్తలు, నాయకులకు రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి కూటమి ప్రభుత్వ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# 2026 - 27 సంవత్సర మద్యం పాలసీకి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోండి..!

## జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ప్రకటన..

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 10: 2026-27 సంవత్సరానికి నూతన మద్యం విధానంలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోని వివిధ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మిగిలిన 31 సాధారణ మద్యం దుకాణాలు, అలాగే గీత కులాల వారికి రిజర్వ్ చేసిన 1 దుకాణం.. మొత్తంగా 32 మద్యం దుకాణాలు రీనోటిఫై చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, డిపి అండ్ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ల వారీగా సాధారణ మద్యం దుకాణాల వివరాలు పరిశీలిస్తే... కడప పరిధిలో 3, మైదుకూరు పరిధిలో 3, రాజంపేట పరిధిలో 6, బద్వేల్ పరిధిలో 1, సిద్ధవటం పరిధిలో 2, ఎర్రగుంట్ల పరిధిలో 5, జమ్మలమడుగు పరిధిలో 5, ప్రొద్దుటూరు పరిధిలో 1, పులివెందుల పరిధిలో 4 మరియు ముద్దనూరు పరిధిలో 1 దుకాణం నోటిఫై చేయబడ్డాయి. వీటితో పాటు ప్రభుత్వం గీత కులాల వారికి ప్రత్యేకంగా కేటాయించిన దుకాణాలలో జిల్లాలోని పెద్దముడియం పరిధిలో 1 దుకాణం ఉన్నాయి. దరఖాస్తు రుసుము చెల్లింపులను దరఖాస్తుదారులు తమ సౌలభ్యం మేరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతుల్లో చెల్లించవచ్చుని, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, స్పష్టం చేశారు. అర్హత మరియు ఆసక్తి గల దరఖాస్తుదారులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తుల స్వీకరణ తేదీ 10.10.2026 నుండి 19.10.2026, అర్ధరాత్రి 12 గంటలు వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, అలాగే మద్యం దుకాణాల లక్కీడ్రా తేదీ 21.10. 2026. తీయడం




జరుగుతుందన్నారు. ఇంకా పూర్తి వివరాలు మరియు రిజిస్ట్రేషన్ సమాచారం కొరకు సంబంధిత ఎక్సైజ్ స్టేషన్లలో సంప్రదించ వచ్చుని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, పేర్కొన్నారు.

# బతుకమ్మ పండుగ వేళ నిరుపేద కుటుంబాలకు అండగా 'ఆయువు స్టూడెంట్స్ యూత్ ఫౌండేషన్'!

- 50 నిరుపేద కుటుంబాలకు చీరలు, దుస్తుల పంపిణీ..

## ఫౌండర్ జి. రోహిత్ ముదిరాజ్



తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మను పురస్కరించుకుని ఆయువు స్టూడెంట్స్ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చేయూత అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జి. రోహిత్ ముదిరాజ్ నేతృత్వంలో 50 నిరుపేద కుటుంబాలకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జి. రోహిత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. పండుగ వేళ పేద కుటుంబాల ముఖాల్లో ఆనందం చూడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, వారి కష్టాల్లో భాగస్వాములవడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేద కుటుంబాలకు తోడ్పాటునందిస్తూ, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు భాను ముదిరాజ్, స్వరూప్, శ్రీనివాస్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# చందానగర్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం!

## అమావాస్య సందర్భంగా 700 మందికి అన్న ప్రసాద వితరణ

చందానగర్, అక్టోబర్ 10: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని చందానగర్ బస్టాండ్ సమీపంలో శ్రీ వాసవీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 700 మందికి అన్నదానం చేశారు.

సమాజ సేవే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, కుటుంబ సభ్యులు, యువకులు, స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పాల్గొని భక్తులకు, ప్రజలకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

ఈ కార్యక్రమానికి చందానగర్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి మంజుల, శ్రీ రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న వారికి సమితి



సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నెల అన్నదాన కార్యక్రమానికి దాతలు, వారి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి ఆర్థికంగా, ఇతర రూపాల్లో సహకారం అందించారు. వారి సేవా దృక్పథాన్ని సమితి సభ్యులు అభినందించారు.

ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ.. "మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో నిరుపేదలకు, ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని సంకల్పించినట్లు వెల్లడించారు.

మరింత మంది ఆర్యవైశ్య కుటుంబాలు, దాతలు, యువత, శ్రేయోభిలాషులు ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ విజయానికి సహకరించిన దాతలు, అతిథులు, స్వచ్ఛంద సేవకులకు సమితి తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

"మన ఐక్యతే మన బలం.. మన సేవే మన గుర్తింపు" అనే నినాదంతో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని సమితి సభ్యులు పేర్కొన్నారు.

# కన్నుల పండుగగా దస్తగిరి స్వామి గ్యార్మి పండుగ మహోత్సవం..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 10: కడప జిల్లా... జమ్మలమడుగు పట్టణంలోని మిఠాయిగిరి వీధిలో ఉన్న దస్తగిరి స్వామి దర్గా వద్ద శనివారం సాయంత్రం కన్నుల పండుగగా దర్గా కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో దస్తగిరి స్వామి గ్యార్మి పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా మసీదు గురువులు సయ్యద్ షా నూరుల్లా బాషా ఖాద్రి భక్తులతో కలిసి దస్తగిరి స్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా కమిటీ నిర్వాహకులు దస్తగిరి స్వామి పవిత్ర జెండాలను పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి దర్గాలో ప్రతిష్టించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ఫాతిహా నిర్వహించి భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేశారు దస్తగిరి స్వామి గ్యార్మి పండుగలో దాదాపు 2000 మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం దర్గా నందు భక్తులందరూ కలిసి గందోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు గురువులు గౌస్ బాషా ఖాద్రి, దర్గా కమిటీ నిర్వాహకులు షేక్ షామీర్ భాష, అసదుల్లా ఖాన్, హాఫిజ్, ఖాదర్ వల్లి, జిలాన్, ఖలందర్, మహమ్మద్ గౌస్, అధిక సంఖ్యలో మిఠాయిగిరి యూత్ సభ్యులు తదితర భక్తులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజంపేటకు ప్రజా స్పందన పసిగట్టే నేత అవసరం: శిల్పి రాజాచారి..!!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 10: ప్రజాస్పందన పసిగట్టే నేత కడప జిల్లా.. రాజంపేట పురపాలక సంఘానికి అవసరమని భవన యజమానుల సంఘం అధ్యక్షుడు శిల్పి రాజాచారి పేర్కొన్నారు. గతంలో పురపాలక సంఘ ప్రజల కోసం పోరాడిన వ్యక్తులను గుర్తించాలని, అలాంటి వ్యక్తులకు పట్టం కడితే పట్టణము అభివృద్ధి పదంలో పయని స్తుందన్నారు. భవన యజమానుల సంఘం ఆధ్వర్యంలో గతంలో పెంచిన పన్నుల మొదలు అనేక సమస్యలపై పోరాటాలు చేశామని, కనుక ఈ మారు పురపాలక సంఘం చైర్మన్ పదవికి తాను పోటీ చేయాలను కుంటున్నట్లు శిల్పి రాజాచారి తెలిపారు. గతంలో పట్టణ ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు పన్నులు తగ్గించేందుకు భవన యజమాను సంఘం చేసిన పోరాటాలను గుర్తించాలన్నారు. కనుక ఈ పురపాలక సంఘం ఎన్నికల్లో తమకు సంపూర్ణంగా మద్దతు ఇచ్చి గెలిపిస్తే పట్టణంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇందుకోసం ఎంత స్థాయి పోరాటాల కైనా తాను సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతము జరగనున్న పురపాలక సంఘం ఎన్నికల్లో ప్రజల కోసం పోరాటాలు చేసే నేతలను వారి సమస్యలపై స్పందించే వారిని గుర్తించాలని రాజంపేట పట్టణ ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాజంపేట పట్టణం దీర్ఘకాలిక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నదని, కనీసం పారిశుద్ధ్యం కూడా పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, కొత్తగా ఏర్పడుతున్న కాలనీలు పట్టించుకునే వారే లేరన్నారు. పట్టణ బ్యూటిఫికేషన్ ఏనాడో మర్చిపోయారని, కనీసం మరుగుదొడ్ల వసతి కూడా సక్రమంగా లేదని వాపోయారు. ఇలా చెప్పుకుంటూ పోతే రాజంపేట పట్టణము సమస్యల సుడిగుండంలో చిప్పుకొని పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనా తీతమన్నారు. కొద్దిపాటి వర్షాలకే డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరుకుంటు న్నాయన్నారు. రాజంపేట పురపాలక సంఘానికి విశేష చరిత్ర ఉందని, వారి చరిత్రను కాపాడే నేతలకు ఈ మారు జరగనున్న ఎన్నికల్లో పట్టం కట్టాలని ప్రజలను కోరారు. తాను ప్రజా సమస్య పరిష్కారం కోసమే జరుగునున్న పురపాలక సంఘం ఎన్నికల్లో చైర్మన్ పదవికి పోటీ చేయాలను కుంటున్నట్లు శిల్పి రాజా చారి వివరించారు.

# పేదలకు అండగా సీఎం సహాయ నిధి

## లబ్ధిదారునికి చెక్కు అందజేత



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కంబాపూర్ గ్రామపంచాయతీలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారునికి గ్రామ సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్ అందజేశారు. ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సీపీఎం నాయకుడు, సీనియర్ పాత్రికేయుడికి ఎమ్మెల్యే పరామర్శ"



సత్తుపల్లి,అక్టోబర్ 10 (బిఎన్ఎస్ )న్యూస్: ఖమ్మం పట్టణంలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తల్లాడ మండలం అన్నారుగూడెం సీపీఎం సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి వెంకటేశ్వర్లును,కల్లూరు పట్టణానికి చెందిన ఈనాడు పత్రిక సీనియర్ పాత్రికేయుడు బలరామ్‌లను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే తో పాటు కల్లూరు సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు,తల్లాడ గోవింద శ్రీను,బుక్క కృష్ణవేణి,నారాయణ తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సినిమా న్యూస్




## రజినీ సినిమాకు సాధారణ రేట్లే?

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' సినిమా విడుదలకు ముందే టికెట్ ధరల అంశం చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వడంతో అభిమానులు, సినీ ప్రేక్షకుల్లో చర్చ మొదలైంది. అయితే తెలంగాణలో మాత్రం ఈ సినిమా టికెట్ ధరలను సాధారణ స్థాయిలోనే కొనసాగించాలని నైజాం పంపిణీదారులు నిర్ణయించినట్లు సమాచారం. ఇదే నిజమైతే తెలంగాణలో సినిమా చూసే ప్రేక్షకులకు కొంత ఊరట లభించనుంది.

రజనీకాంత్, నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో రూపొందుతున్న 'జైలర్ 2' అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినిమా విడుదలైన తొలి ఏడు రోజుల పాటు టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇచ్చింది. అక్టోబర్ 15 నుంచి 21 వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.75 అదనంగా వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అలాగే రోజుకు ఐదు ఆటలు ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. డబ్బింగ్ సినిమాకు కూడా టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వడంపై కొందరు నెటిజన్లు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. భారీ అంచనాలున్న సినిమాల కోసం ప్రేక్షకులు అదనపు ధరలు చెల్లించాల్సి రావడం సరైనదేనా? అనే చర్చ సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తోంది.

మరోవైపు తెలంగాణలో 'జైలర్ 2' టికెట్ ధరల విషయంలో సరికొత్త నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నైజాం పంపిణీదారులు సాధారణ టికెట్ ధరలనే కొనసాగించాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమాచారం ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధర రూ.175గా, మల్టీప్లెక్స్‌లలో రూ.295గా ఉండనుంది.అయితే తెలంగాణలో ఈ ధరలకు సంబంధించి అధికారిక ప్రకటన రావలసి ఉంది. సాధారణ ధరలే అమల్లో ఉంటే కుటుంబంతో కలిసి సినిమా చూడాలనుకునే ప్రేక్షకులకు, ముఖ్యంగా మల్టీప్లెక్స్‌లకు వెళ్లేవారికి కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.ఒకవైపు ఏపీలో టికెట్ ధరల పెంపు, మరోవైపు తెలంగాణలో సాధారణ ధరలకే సినిమా అందుబాటులో ఉంటుందన్న సమాచారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పండుగ సమయంలో విడుదలవుతున్న పెద్ద సినిమాలకు టికెట్ ధరలు కీలక అంశంగా మారుతున్నాయి.



## మాస్ తుఫాన్ మళ్లీ షురూ

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ రాబోతున్న విషయం తెలిసిందే. "ఎన్టీఆర్ 31' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫైనల్ చేశారు మేకర్స్. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, టీ–సిరీస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనిల్ కపూర్, బిజు మీనన్, అశుతోష్ రాణా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు మేకర్స్. కానీ ఇటీవల ఎన్టీఆర్ చేతికి గాయం కావడంతో షూటింగ్‌కు బ్రేక్ పడింది. దీంతో సినిమా అనుకున్న టైమ్‌కు రిలీజ్ కాదని అంతా భావించారు. ఇలాంటి టైమ్‌లో షూటింగ్ అప్డేట్ ఇచ్చాడు నటుడు బిజు మీనన్. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఈయన డ్రాగన్ షూటింగ్ అప్డేట్ ఇస్తూ.. 'ఎన్టీఆర్ కి గాయం అవ్వడం వల్ల షూట్ కొంతకాలం ఆగింది. ఇప్పుడు తిరిగి ప్రారంభమైంది' అంటూ చెప్పుకొచ్చాడు. ప్రజెంట్ నటుడు బిజు మీనన్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. 'మాస్ తుఫాన్ మొదలైంది' అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఎన్టీఆర్ ఫ్యాన్స్.

## మాస్ రాజాతో వివేక్ ప్రయోగం!

టాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా ఊరిస్తున్న క్రేజీ కాంబినేషన్‌కు ఎట్టకేలకు అధికారిక ముద్ర పడింది. మాస్ మహారాజా రవితేజ తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఎవరితో చేయబోతున్నారన్న సస్పెన్స్‌కు తెరదించుతూ మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. విలక్షణ కథలతో టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన యువ దర్శకుడు వివేక్ ఆత్రేయతో రవితేజ కొత్త సినిమా చేయబోతున్నారు. రవితేజ కెరీర్‌లో 78వ మైలురాయిగా రాబోతున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్‌తో ఫ్యాన్స్‌లో ఒక్కసారిగా జోష్ పెరిగింది. ఈ ప్రాజెక్ట్‌పై ఎప్పటినుంచో ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నప్పటికీ, చిత్ర నిర్మాణ సంస్థ 'ది బ్రిడ్జ్ ప్రొడక్షన్స్' అధికారికంగా ప్రకటించడంతో నెట్టింట వైరల్ అవుతోంది.

లక్ష్మణ్, శ్రీనిరావు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవితేజ మార్క్ అన్‌స్టాపబుల్ ఎనర్జీకి.. వివేక్ ఆత్రేయ మార్క్ ఇంటెలిజెంట్, విభిన్న స్క్రీన్‌ప్లే తోడైతే వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ అవుతుందోనని సినీ ప్రియులు లెక్కలు వేసుకుంటున్నారు. రవితేజను పూర్తిగా సరికొత్త అవతారంలో చూపించేలా వివేక్ అదిరిపోయే కథను సిద్ధం చేశారని టాక్. ఇక ఈ సినిమాలో రవితేజకు జోడీగా నటించే హీరోయిన్ ఎవరు? కీలక పాత్రల్లో ఎవరెవరు కనిపించనున్నారు? అనే విషయాలను మేకర్స్ ఇంకా రివీల్ చేయలేదు. అయితే వీటన్నింటికీ సమాధానం అక్టోబర్ 11న గ్రాండ్‌గా రివీల్ చేయనున్నట్లు యూనిట్ అఫీషియల్‌గా ప్రకటించింది. టైటిల్ పోస్టర్‌తో పాటే సినిమా జానర్, హీరోయిన్, తారాగణంపై క్లారిటీ ఇచ్చే అవకాశం ఉండటంతో ఆ రోజు కోసం మాస్ మహారాజా ఫ?్యన్స్ చాలా ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.




సాధారణంగా ఏ సినిమా అయినా థియేటర్లలోకి వచ్చిన మూడో నెల నాటికి కలెక్షన్లు తగ్గిపోవడం చూస్తుంటాం. కానీ, 'హనుమాన్ అంశ్' సినిమా మాత్రం 9వ వారంలోనూ బాక్సాఫీస్ వద్ద అదరగొడుతూ, విశేష ప్రేక్షకాదరణతో బాక్సాఫీస్ వద్ద తన దిగ్విజయ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఈ భక్తిరస చిత్రం 64వ రోజున ఏకంగా 60 శాతం మేర వసూళ్లను పెంచుకోవడం విశేషం. అప్పటివరకు హిందీలో మాత్రమే నడుస్తున్న ఈ చిత్రానికి అదనంగా, అక్టోబర్ 9న తెలుగు వెర్షన్ కూడా థియేటర్లలోకి రావడమే ఈ భారీ పెరుగుదలకు ప్రధాన కారణం.

రిలీజైన 64వ రోజున ఈ సినిమా రెండు భాషల్లో కలిపి భారతదేశంలో రూ. 1.20 కోట్ల నికర వసూళ్లను సాధించింది. దీనికి ముందు రోజు సాధించిన రూ. 75 లక్షలతో పోలిస్తే ఇది ఏకంగా 60 శాతం ఎక్కువ. ఈ రోజు వసూళ్లలో హిందీ వెర్షన్ నుంచి రూ. 60 లక్షలు రాగా, మొదటి రోజు విడుదలైన తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా సరిగ్గా రూ. 60 లక్షల వసూళ్లను రాబట్టింది. దీంతో ఇప్పటివరకు భారతదేశంలో ఈ సినిమా సాధించిన మొత్తం నెట్ కలెక్షన్ రూ. 329.18 కోట్లకు చేరుకోగా, ఇండియా గ్రాస్ వసూళ్లు రూ. 388.77 కోట్లకు చేరాయి. ఇక విదేశాల్లో రూ. 40.05 కోట్ల గ్రాస్ సాధించడంతో, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం గ్రాస్ వసూళ్లు 64 రోజుల నాటికి రూ. 428.82 కోట్ల మైలురాయిని చేరుకున్నాయి.

బాక్సాఫీస్ లెక్కలు చూస్తే.. 9వ వారంలో 'హనుమాన్ అంశ్' చిత్రం రూ. 10.60 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. ఇతర పెద్ద చిత్రాలైన ధురంధర్ 2 (రూ. 2.19 కోట్లు), ధురంధర్ (రూ. 1.75 కోట్లు), ఛావా (రూ. 1.25 కోట్లు), స్త్రీ 2 (రూ. 88 లక్షలు) సినిమాలు వాటి 9వ వారంలో సాధించిన కలెక్షన్లన్నింటినీ కలిపినా, ఈ ఒక్క చిత్రం సాధించిన వసూళ్లే చాలా ఎక్కువ కావడం విశేషం. అంతేకాకుండా అక్టోబర్ 8 నాటికి బుక్‌మైషోలో ఈ సినిమా 80 లక్షలకు పైగా టికెట్ల విక్రయాలను సాధించింది. ఒక్క 9వ వారంలోనే బుక్‌మైషో ద్వారా దాదాపు 2.61 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. ఇక పివిఆర్, ఐనాక్స్, సినీపోలిస్ వంటి మల్టీప్లెక్స్ నెట్‌వర్క్‌లలో ఈ వారంలో 2.58 లక్షల మంది ప్రేక్షకులు సినిమాను చూడగా, రూ. 6.60 కోట్ల గ్రాస్ వసూలైంది.

ఈ సినిమా బాక్సాఫీస్ ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఆగస్టు 7, 2026న థియేటర్లలో విడుదలైన తొలిరోజు కేవలం రూ. 10 లక్షల కలెక్షన్ మాత్రమే సాధించింది. మొదటి వారంలో రూ. 1.08 కోట్లు, రెండో వారంలో రూ. 40 లక్షలు వసూలు చేసిన ఈ సినిమా, మూడో వారం నుంచి ఊపందుకుని రూ. 10.40 కోట్లు సాధించింది. ఆ తర్వాత నాలుగో వారంలో రూ. 61 కోట్లు, ఐదో వారంలో అత్యధికంగా రూ. 90.25 కోట్లు రాబట్టింది. ఆ తర్వాత ఆరో వారంలో రూ. 80.25 కోట్లు, ఏడో వారంలో రూ. 44.80 కోట్లు, ఎనిమిదో వారంలో రూ. 29.20 కోట్లు, తొమ్మిదో వారంలో రూ. 10.60 కోట్లు సాధించి బాక్సాఫీస్ వద్ద తన జోరును ప్రదర్శించింది.

## తెలుగు బూస్ట్ బాక్సాఫీస్ బ్లాస్ట్!




## గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి నాని

నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూనే మరోవైపు తన ప్రయోగాత్మక చిత్రాలతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఇటీవలే ఆయన నటించిన 'ది ప్యారడైజ్' సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ భారీ విజయం అందించిన జోరును ఏమాత్రం తగ్గించకుండా, నాని తన తదుపరి ప్రాజెక్ట్ కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో నాని ఒక క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సిద్ధమయ్యారు. "బ్లడీ రోమియో" అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ మరియు గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. కేవలం యాక్షన్ హీరోగానే కాకుండా, ఒక వైవిధ్యమైన చెఫ్ పాత్రలోనూ, అలాగే మరోవైపు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గానూ ఆయన ద్విపాత్రాభినయం లేదా విభిన్న షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో అదరగొట్టనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ఈ సినిమా కోసం మేకర్స్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిహారిక ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సుజీత్ టేకింగ్, నాని బాడీ లాంగ్వేజ్ ఈ సినిమాను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తాయని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తి చేసి, వచ్చే ఏడాదిలోనే (2027) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'ది ప్యారడైజ్' సక్సెస్ ఇచ్చిన జోరుతో నాని ఇప్పుడు పూర్తిగా గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి మారిపోయి బాక్సాఫీస్ వద్ద మరో సంచలనానికి తెరతీస్తున్నారు.

